


ఉవ్వెత్తుగా పైకి లేచిన సముద్ర కెరటాలు విరిగిన అలలను తనలో కలుపుకుంటూ, పాలనురుగులను ఏక్కుతూ, చల్లగా మెత్తగా ఇసుకను దాటుకుంటూ ముందుకు పరుగులు తీస్తున్నాయి.

చిరుచీకటి పడబోతున్నా పౌర్ణమి వెన్నెలతో, ఆ వాతావరణం ఎంతో అందంగా ప్రశాంతంగా వుంది. ఉవ్వెత్తుగా విరిగి పడుతున్న అలలు, ప్రేమికుల హృదయాలలో పొంగిపొరలే అనురాగ తరంగాలలా తియ్యగా మత్తుగా వున్నాయి. ఆ హోరు ఎందరో ప్రేమికుల తియ్యని రహస్యాలను, హృదయం నిండుగా దాచుకుని మధురంగా రొద పెడుతున్నట్లుగా వుంది.

బయట ప్రపంచంతో సంబంధం లేనట్లుగా పదాలు పాడుతూ ఎంగిరెగుర వేస్తున్న జెన్నవాళ్లను, ఎన్నో అనుభూతులను గుండెలో దాచుకుని, మరింత నిండుగా ప్రవహిస్తున్న సముద్రాన్ని, పరవశంగా, యోగినిలా, మోకాళ్ల మధ్య తల ఆన్చి చూస్తున్న శ్యామలను, ఏదే కంగా చూస్తున్న శంకర్ కళ్లు చెమర్చాయి?

పూవు పుట్టటం పరిమళంతో విరబూయటం, భ్రమరాన్ని ఆకర్షించి, తియ్యని మకరందంతో విందులు చేయటం ప్రకృతి సహజం. తియ్యతియ్యని తేనె నందించిన ఆ కుసుమం జీవితం ధన్యమైనట్లు దివ్యానుభూతిని చెందుతుంది. చరితార్థతను సాధించు కుంటుంది.

—కాని—

హృదయమంతా మకరందాన్ని నింపుకుని, ప్రకృతి సహజంగా విరబూసిన అందమైన కుసుమం—తన వెలవు ఎడారి అన్న సత్యాన్ని తెలుసుకుని ఏకాకిగా రాలిపోయే దురదృష్టక్షణాన్ని తలచుకుంటూ, భయంకరమైన వంటరితనంతో వాడి రాలిపోవచ్చు—

—లేదా పగబట్టిన విధిని దూషించే శక్తికూడా లేని —అశక్తతతో — తీవ్రమైన ఇసుక తుఫానుకు బలియై— సమసిపోనూ వచ్చు.

'శ్యామా...!' ఆప్యాయంతో పిలిచిన ఆ కంఠం జీరపోయి అపశృతులు పల్కింది.

'ఊ...!' పరధ్యానంగా ఏటో చూస్తున్న శ్యామల మెల్లగా తల తిప్పి శంకర్‌ని చూసి తలవాల్చింది. బరువుగా జారిన కన్నీరు బుగ్గలమీద ముత్యాలుగా మెరిశాయి.

'నన్ను క్షమించగలవా శ్యామా!' మరింత గద్గదంగా ధ్వనించింది శంకర్ గొంతు.

'ఎందుకు? మీరేం చేశారని...?' దాచుకుందామన్నా దాగని ఆవేదన కంఠంలో,

ప్రతిఫలించిందా?

'ఇంతకన్నా ఇంకేం చెయ్యాలి? నువ్వు కోరుకున్న స్వర్గాన్ని నీనుంచి దూరం చేసి, నిన్ను శాశ్వతంగా ఏకాకిని చేసి, నా దారి నేను చూసుకున్నాను. సుఖపడ్డాను సుఖపడుతున్నాను...'

'అప్పటి మీ పరిస్థితులు...!' చిన్నగా అనబోతూ శంకర్ ఆవేశాన్ని చూసి ఆగిపోయింది...

'పరిస్థితులు ఎటువంటివైనా—నువ్విలా అయిపోతావని ఆనాడే తెలిస్తుంటే—'

'తెలిస్తుంటే...' శ్యామల కళ్లలో నిండిన నీరు శంకర్ కళ్లను అశ్రువులతో నింపాయి.

'నిన్ను దూరం చేసుకునేవాడ్ని కాదు శ్యామా...!' అరచేతిలో నుదురు పట్టుకుని శోకమూర్తిలా కూర్చున్న శంకర్‌ని తమాషాగా చూసింది శ్యామల. ఎవరూ అర్థంచేసుకోలేని భావాలాక్షణం శ్యామల కళ్లలో మెరుపులా మెరిశాయి.

'నన్ను దూరం చేసుకునేవారు కాదా! ఇంకా నన్నెందుకు మభ్యపెడతారు? కనీసం నేనింకా బ్రతికి వుండగలననే అనుకున్నారా మీరసలు. నా సర్వస్వంగా ప్రేమించిన మీరు, కొన్ని పరిస్థితుల వల్ల మరొకరిని వివాహం చేసుకోబోతున్నానని, వ్యవధిలేదని, ఇప్పుడేమీ చేయలేని పరిస్థితని, ... నా ఎదురుగా చెప్పగలిగినప్పుడే మీకు తెలియదా నా గుండె ఎంతగా బ్రద్దలై వుంటుందో. మీ శుభలేఖ, స్వయంగా నాచేతి కందిస్తున్నప్పుడేమీ కన్పించలేదా, మిమ్మల్ని నమ్ముతున్న ఒక అమాయకురాలి జీవితం ఆ క్షణంలోనే సమూలంగ నాశనమైపోయిందని. ఆత్మసాక్షిగా నాతో అనుబంధాలను పెంచుకున్న మీరు, అగ్నిసాక్షిగా మరొకరి మెడలో మంగళ సూత్రం కట్టబోతున్నప్పుడు కూడ తెలియలేదా మీ శ్యామల జీవితం అంధకారంలో మునుగుతుందని—

క్రొత్త పెళ్ళికొడుకై, తీయని తలపులో తరిగి వచ్చారు [illegible], యోగి[illegible] [illegible] నా మనో[illegible], గ్రహించే అవసరం, గ్రహించ[illegible] [illegible], [illegible] నాటిపోయిందని, [illegible] మీ [illegible], మీ తలపులు, మీ ఆలోచనలు, నన్ను వీడి మరొకరి అదృష్టవంతురాలిచుట్టూ తిరుగుతూ వుంటాయని గ్రహించటానికి ఎంతోసేపు పట్టని నా హృదయం ఎంతగా క్షోభించిపోయిందో ... ఎంతగా కుమిలిపోయిందో... కనీసం ఆనాడైనా మీరు గుర్తించి వుంటే...'

ఆవేశం, ఆవేదన ఆపుకోలేని శ్యామల హృదయం కరిగి కన్నీరై గతంలోకి పరుగులు తీస్తోంది.

ఎటువంటి పరిణామమైనా, తట్టుకోగల నిశ్చలతతో, ఎవరూ అర్థం చేసుకోలేని మనో భావాలతో శిలలా, శ్రోతలా మిగిలిపోయాడు శంకర్.

ఆ క్షణంలో అతని హృదయం అనుభవించే రంపపుకోత ఎవరికీ అర్థం కాదు, ఒక్క శ్యామలకు తప్ప. కానీ, ఇప్పుడామె అతని మనో భావాలను అర్థం చేసుకునే స్థితిలో లేదు —

ఎన్నో ఏళ్ళుగా గూడు కట్టుకున్న హృదయవేదన, నా అంటూ చెప్పుకునే వారెవరూ లేని, భయంకర ఏకాంతంలో, మరింతగా పెరిగి, హృదయాన్ని అల్లకల్లోలం చేస్తున్నా, అజ్ఞాతంగానే దాగున్న మానసికవ్యథ ఈనాడు, శంకర్ సమక్షంలో, అడ్డూ అపూ లేకుండా కట్టలు త్రెంచుకుని ప్రవహిస్తోంది...

'శంకర్ అప్పటి నా పరిస్థితి ఎంత దుర్భరంగా వుండేదో, మీకు తెలియదు. చదువు సగంలో వుంది, జీవితం మీదే ఎటువంటి ఆశలూ లేని నేను చదువుమీద దృష్టి నిలపలేక పోయేదాన్ని. నా భవిష్యత్ అంధకారంగా, నన్ను పరిహసిస్తూ నాముందు నిలిచింది. అతి ప్రయాసమీద కలల్లోనే నేను కట్టుకున్న ప్రణయ సౌధానికి మరొకామె రాణి అయింది. నేను గుడి కట్టుకున్న మీ గుండెలో, నేను ప్రతిష్ఠించుకున్న ఆ దేవాలయంలో మీ అర్ధాంగిగా మరొకామె అడుగు పెట్టబోతోంది—

ఇంత చిన్న వయసులోనే నా జీవితం విషాదాంతం కాబోతోందన్న సత్యం నన్ను కలచివేసింది. పిచ్చిదాన్ని చేసింది.

మీకు దగ్గరకాలేక — దూరం [illegible] లేకా, నేను పడ్డ నరకయాతన మీకెలా అర్థమౌతుంది శంకర్.

ఏ ముచ్చటా తీరకముందే ఏ మధురానుభూతిని అందుకోకముందే నా జీవితం తెల్లవారి పోయింది—

అందమైన జంట ముచ్చటగా నడిచి వెడుతుంటే మనసు కలుక్కుమనేది. ఎక్కడో మ్రోగుతున్న మంగళ వాద్యాలు కూడ నా హృదయంలో తీవ్రమైన అశాంతిని రేపేవి—

భయంకరమైన ఏకాంతం నన్ను పిచ్చిదానిని చేసేది. ఎన్నో వెన్నెల రాత్రులను కళ తప్పిన నా కనులు నిర్లిప్తంగా చూస్తూ గడిపివేశాయి—

శంకర్! నేను రచయిత్రిని కాకుంటే, భరింపరాని ఆ బాధను కాగితాలమీద పెట్టే శక్తి నాకు లేకుంటే, నేను నిజంగా, అప్పుడే...అప్పుడే...పిచ్చిదాన్నయి పోయేదాన్ని...'

'వద్దు ... వద్దు శ్యామా. అంతటి హాలాహలాన్ని, నువ్వు కనుక భరించావు. కనీసం...వాటిని విని భరించగలిగే శక్తి కూడ నాకు లేదు ప్లీజ్ ... చెప్పొద్దు శ్యామా...!' కోటి బాధాసూచికలు ఒక్కుమ్మడిగా శంకర్ హృదయాన్ని కలచివేశాయి.— జాలిగా అతనికళ్ళు అర్థిస్తుంటే—

—పేలవంగా నవ్వింది శ్యామల—

"కనీసం ఈ అదృష్టమైనా నాకు దక్కనియ్యండి శంకర్. ఇన్ని సంవత్సరాలుగా నాలో పేరుకున్న ఈ అశాంతిని, ఈ హాలాహలాన్ని...నేను భరించలేక పోతున్నాను. దయచేసి మీ ముందుంచనియ్యండి. నా హృదయభారాన్ని ఈ విధంగానైనా కొంత తగ్గించి పుణ్యం కట్టుకోండి... కనీసం ఈ సహాయాన్నయినా నాకు చెయ్యండి శంకర్!' మూర్తీభవించిన శోకమూర్తిలాగా మోకాళ్లమధ్య తల అన్చుకుని నిశ్శబ్దంగా రోదిస్తున్న శ్యామలను చూసి చలించి పోయాడు శంకర్. ఒక్కసారిగా వొడిలోకి తీసుకుని, గుండెలకు హత్తుకుని 'ఇక ఏడవకు శ్యామా... నేను వచ్చాను...నీకోసం నేనున్నాను... అందుకే ఇన్నేళ్ల తరువాత మరమిలా కలుసుకోగలిగాము..! అనాలన్పించింది. [illegible] దగ్గరగా అనుకుని తనవేళ్ళ ఆరాటంతో ఆ కళ్ళలో నున్న తడుపు [illegible] ఇప్పటిని శాశ్వతంగా తుడిచివేసి

తన లోకి చేర్చుకోవాలని తహతహ లాడిం దతని హృదయం.

కానీ—ఏదో అజ్ఞాతశక్తి శంకర్‌ని మూగవాడ్ని చేసింది.

బహుశా ప్రేయసీ ప్రియులేమో, ! తమకు తెలియకుండానే గడిచిన కాలాన్ని తిట్టుకుంటూ..., మధుర స్మృతులను నెమరు వేసుకుంటో...ఏదో తన్మయావస్థలో...ఆ చీకటిలో కూడ—ఒకరి కళ్లలో మరొకరు ఏవేవో భావాలను వెదుకుతూ...క్షణమైనా విడచి జీవించలేనంత సన్నిహితంగా ముందుకు నడుస్తున్నారు మల్లెల సౌరభం ఒక్కసారిగా ఆ పరిసరాలను తియ్యని మత్తుతో నింపింది.

జీవితంలో ఎంతో పోగొట్టుకున్నా మన్న భావనను ముందుకు పరుగులు తీస్తున్న చందమామ, వెనుక తన్నుకు వస్తున్న మల్లెలమారుతం, బలపరుస్తూ పరిహసిస్తుంటే — బరువుగా కను రెప్పలను విచ్చుకుని తననే ఏదేకంగా చూస్తున్న శంకర్‌ని చూసి మరింత బరువుగా కళ్ళు దించుకుంది శ్యామల. ఆమె తెల్లని బుగ్గలమీద మెరుపులా మెరుస్తున్న కన్నీళ్లను విచలిత హృదయంతో, నిస్సహాయంగా చూస్తూ వుండిపోయాడు శంకర్.

సముద్ర కెరటాలతో ఆడుకుంటున్న చందమామ ఎందుకో — జాలిగా చూస్తున్నాడు.

—పాలపొంగులాంటిది యవ్వన పుపొంగు. చన్నీళ్లను చిలకరిస్తే పాలపొంగు అణగారిపోతుంది. ఎన్నడూ ఎదురు చూడని విపరీత పరిణామాలు హృదయాన్ని తీవ్రంగా గాయపరచి భరింపరాని వేదనతో ద్రవింపజేసి ... నవయవ్వనోద్రేకాన్ని కూడ చల్లబరచి యవ్వనపు తొలి ఘడియలలోనే వృద్ధాప్యాన్ని ప్రసాదిస్తాయి.

చల్లారిన పాలకు వేడి తగులుతే తిరిగి పొంగుతాయి. కానీ— బడబాగ్నిలో మాడిపోయిన హృదయం కన్నీళ్ల చల్లబడి విర్లిప్తతతో నిలచిపోతుందే కాని— తిరిగి ఎటువంటి వేడినీ దగ్గరకు రానివ్వదు.

పుచ్చపువ్వులాంటి పౌర్ణమి వెన్నెలలో సముద్రుడు ఉరకలు వేస్తున్నాడు,

# ఆత్మార్పణ

'శంకర్...వాళ్లు...వాళ్ళు...అదృష్టవంతులు కదూ... !' దూరవహౌతున్న ఆ ప్రేయసీ ప్రియులను బరువుగా చూస్తున్న శ్యామల గొంతు వణికింది.

మరుక్షణం తలయెత్తిన శంకర్ తప్పుచేసినట్టు తల దించుకున్నాడు.

'శంకర్ ఎంత దురదృష్టవంతులకైనా జీవితాంతం గుర్తు పెట్టుకుని కనీసం ఆ తలపులతోనైనా జీవించ గలగటానికి, ఏదో మధురానుభూతైనా, మిగిలివుంటుంది. నాలాంటి దురదృష్టవంతులకి, ఆ అనుభూతులు కూడా, కలలలోనే పరిచయమై, కలలోనే అంత వహౌతాయి కదూ—'

అదోలా నవ్వుతున్న శ్యామలని సూటిగా చూడలేక పోయాడు శంకర్.

'మీకు గుర్తుందా శంకర్. మనసును, మమతలను, ఉద్వేగాన్ని, - అణుచుకోలేని రోజులవి. మనసు నిండుగా గూడు కట్టుకుని వున్న హృదయ బాధని వంటరిగా భరించలేక, మీ తోడు కావాలని పరితపించే రోజులవి నిర్జనంగా సాగిపోతున్న భయంకర ఏకాంతాన్ని, అట్టుకునే శక్తిలేక మీ పొందును వాంఛించిన కన్నె హృదయపు పొంగు అనాటిది.


మీ దగ్గర ఏకాంతంగా కూర్చుని ఏవేవో మీతో చెప్పుకోవాలన్పించేది. కనీసం కొద్ది క్షణాలైనా భయంకరమైన ఈ వంటరితనంనుంచి నాకు విముక్తిని కల్పించి నన్ను మీలో జేర్చుకోమని కన్నీటితో అర్థించాలన్పించేది — మానసికంగా ఒకరి నొకరు ఆరాధించుకుంటున్న మన పవిత్ర అనుబంధానికి విలువలను కట్టగలిగే శక్తి లోకానికి లేదు. రెండు పవిత్ర దేవాలయాలను పవిత్ర దృష్టితో చూసి, అభినందించేటంతటి హృదయ ఔన్నత్యం లేని లోకంముందు, మనం, మన ఆశయాలు, ఆశలు సమూలంగా దగ్ధమై పోయాయి. భార్యాభర్తలైతేనే తప్ప, ఒక యువతీ యువకుడు, కలసి మాట్లాడుకున్నా, మనసు విప్పి పవిత్రంగా సంచరించినా తప్పుపట్టి అభాండాలు వేసే ఈ లోకం, పైకి కన్పించే మాంగల్యానికే తప్ప, ఆత్మలలో వెలిగే పవిత్ర అనుబంధాలని గుర్తించి గౌరవించలేదు. అందుకే వారి దృష్టిలో నేను మీకేమీ కాను ... కాకూడదు.

శంకర్! మనని అతి దారుణంగా విడదీసిన సంఘటనల మధ్య నా హృదయం ఎంతగా నలిగిపోయిందో మీకు తెలుసా ..

కలకాలం మీతో కాపురం చెయ్యటానికి, నా దైవంతో జీవితాంతం పాలు పంచుకోడానికి, మీ పిల్లలకు తల్లిగా, మీ ఇంటికి ఇల్లాలుగా మరొక అదృష్టవంతురాలు అగ్నిసాక్షిగా మీచేత బంధింపబడినా—

నా ఆశలు సమూలంగా నాశనమైనా—నేను విని భరించలేననుకున్న, ఎన్నో సంఘటనలను కళ్లారా చూసి కూడ — జీవచ్ఛవాన్ని అయానే కాని జీవం పోగొట్టుకోలేక పోయాను. ఎందుకో తెలుసా! మీకోసం— మీకిచ్చిన మాటను నిలబెట్టుకోటం కోసం ... చక్కని మీ చిరునవ్వును, తనివితీరని మీ రూపాన్ని పదిలంగా హృదయంలో దాచుకునే అదృష్టం కోసం—

కానీ నేనూ స్త్రీనే శంకర్. స్త్రీ సహజమైన ఏవో భావాలు తీరగ నన్ను కదిలించి వేసేవి. అందుకే—విషాద భరితమైన నా జీవితంలో మొదటి అంశం ముగిసేముందు...నాకూ ..అందరిలా కాకపోయినా... కనీసం చిరకాలం గుండెలో దాచుకోగల మధురానుభూతి కావాలన్పిం



పించి. వృద్ధాప్యంలో ఏకాకిగా మిగిలినా, నా తలపులలో, మరపురాని మధుర స్మృతి, అనుక్షణం, నన్ను అర్థంకాని భ్రాంతిలో ముంచి, నాకూ శాశ్వత ఆనందాన్ని అందించ గలిగే మధుర స్మృతి నాకు కూడ కావాలన్పించింది. ఏకాంతంగా, కనీసం, ఒక్క క్షణమైనా నా హృదయభారం తీరేలా మీ హృదయంపై తలవాల్చి చిన్నపిల్లలా వెక్కి వెక్కి ఏడవాలన్పించింది. మీ ఓదార్పును అందుకుని నన్ను నేనే ఊరడించుకుని ఆ స్మృతినే మరపురాని సన్నివేశంగా మలుచుకుని, జీవితాంతం ఆ దృశ్యాన్నే మననం చేసుకుంటూ కన్ను మూయాలన్పించింది.

కానీ విధిమీద పగబట్టిన మీరు నా విషయంలోనూ కఠినంగా మారిపోయారు. నన్ను అర్థంచేసుకుని అర్థం చేసుకోనట్టు ప్రవర్తించేవారు. ఐనా ఆమె పట్ల మీ విధిని చక్కగా నిర్వర్తించే మీ మనోభావాలను అర్థంచేసుకోలేక కుమిలి పోయేదాన్ని. మీతో కనీసం ఒక్కక్షణమైనా మాట్లాడే అదృష్టం దొరకని నన్ను వదిలి...ఆమెతో... మీరు...ఎక్కడికో వెళ్ళినప్పుడు...

నేనూ స్త్రీని కనుక ఘన్నుర మండే హృదయాన్ని అదుపులో పెట్టుకోలేక పోయేదాన్ని... ఆ తరువాత మనం విడిపోయి...'

హృదయం నిండుగావున్న బాధ కంఠాన్ని

# ఆత్మార్పణ

దాటి ఇక రాలేనంది. ఎర్ర కలువలలా నీటిని విముక్తున్న శ్యామల కళ్ళలోనే ఆ బాధంతా ప్రతిఫలిస్తోంది.

ఎన్నో సంవత్సరాలు వెనుకకు పోయినట్టు ఏదో సమాధిలో వున్నట్టు ప్రతిమలా కూర్చుండిపోయిన శంకర్ మనసు స్తంభించిపోయింది. తనింతవరకూ ఎవరితోనూ చెప్పుకోలేక అతిదారుణంగా మనసులోనే దాచుకుని చిత్రవధ ననుభవిస్తున్న తన మనోవ్యథ అజ్ఞాతంగానే తన ప్రేమమూర్తి హృదయంలో చొరబడి, ఒకటిగా విలయతాండవంచేసి, మానసికంగా ఇద్దరినీ దగ్ధంచేసిన ఒక మూగవేదన, ఈనాడు ఇద్దరి హృదయాలలో దారుణమైన తుఫాను రేపింది—

వారి హృదయాలకు ప్రతిధ్వనిగా ఉరకలు వేస్తున్నాడు సముద్రుడు.

పరాంగా ఇసుకను కెలుకుతూ శంకర్‌ని చూసి తలదించుకుంది శ్యామల. నెమ్మదిగా కళ్ళు తెరుచుకుని తల యెత్తి చూసింది.

'క్షమించు శంకర్ మరీ ఇన్నేళ్ళ తరువాత కల్సుకున్నామేమో ... పెద్దదానిలా మీముందు ఏమేమో మాట్లాడాను .. అయినా చాలా చిన్నపిల్లలా మాట్లాడాను .. అసలివాళ నేను నోరు విప్పి మాట్లాడగలనా అనుకున్నాను...!'

అతి తేలిగ్గా నవ్వాలని ప్రయత్నించింది శ్యామల:

'రచయిత్రివి...పైగా లెక్చర్లివ్వటం అలవాటున్నదానివి...!' ఏదో అనాలని ఏదో అంటున్న శంకర్‌కి తన మాటలు తనకే ఎబ్బెట్టుగా అన్పించాయి...

తెల్లని వెన్నెలలో, తెల్లపాలరాయిలా మెరుస్తున్న శంకర్‌ను చూసి బరువుగా కళ్ళు దించుకుంది. 'శంకర్ ఇటువంటి ఏకాంతమే...మనకు ఆనాడే దొరికినట్టయితే...మనమిలా...ఇంత దూరంగా కూర్చుని...!' అదోలా భారంగా నవ్వింది. శ్యామల.

శ్యామల నవ్వుకు ప్రతిగా జీవంలేని మందహాసం చేశాడు శంకర్.

'మనమిలా కలుస్తామని కలలోకూడ అనుకోలేదు కదూ...ఆరోజుల్లో ఒకేచోట వుండాలని ఎంతో అనుకునేవాళ్ళం...కానీ ఆ పరిస్థితులలో ఒకరి కనుసన్నలలో మరొకరం వుండటం దుర్భర మన్పించి, దూరంగా...విడిపోయాం...తిరిగి ఇప్పుడు ...ఇలా...ఒక స్వాప్నం'...భారంగా నిట్టూర్చింది శ్యామల.

'శ్యామా' ఒక మాటడుగుతాను. కోపం తెచ్చుకోవు కదూ...!' దీనంగా, బాధగా అంటున్న శంకర్‌ని, తమాషాగా చూసి, చిన్నగా నవ్వింది శ్యామల.


'ఇకపోతే మీమీద కోపం తెచ్చుకుంటానా .మీలా నాకు ముక్కుమీద కోపమే వుంటే ..నేనిలా వుండేదాన్నే కానుగా... ఆరోజు...నన్ను కాదని మరొకర్ని ,చేసుకున్న రోజునే నాకు కోపం రాలేదు ..మీ మనసు బావుండక పిచ్చిగా ... నన్ను 'గెటౌట్' అన్నప్పుడే...!'

'అది నువ్వింకా మర్చిపోలేదా శ్యామా...!' బాధగా నుదురు కొట్టుకున్నాడు శంకర్.

'ఉహూ...ఆ రోజులని మీ మాటలని, మీ చేతలనీ అంతతేలిగ్గా మర్చిపోగలిగితే ..ఇంక నాకు తోడుగా జీవితంలో మిగిలేదేముంటుంది?'

గతంలోకి పరుగులు తీసిన శంకర్ హృదయం బాధతో తల్లడిల్లిపోయింది. మోహం వాలిపోయి దీనంగా శ్యామలను చూశాడు.

'శ్యామా ప్రాణప్రదంగా నన్ను



ప్రేమించిన అమ్మ అనుమతిస్తూ నా జీవిత భాగస్వామిని నిర్ణయించి నాచేత ప్రమాణం చేయించుకుని కన్నుమూసింది —అమ్మను పోగొట్టుకున్న నాకు ప్రపంచ మంతా శూన్యంగా కన్పించింది. దాదాపు పిచ్చివాణ్ణి అయ్యాను. వెనుకముందు ఆలోచించక అమ్మకిచ్చిన మాటకు నా జీవితాన్నే బలి చేశాను—

మనసారా నేను ప్రేమించిన నీకు ద్రోహంచేశాను. అప్పుడు నీకు పరీక్షలు: ఇంట్లో వత్తిడి ఎక్కువైంది. అమ్మ కిచ్చిన మాటను నా అసహాయతను అలుసుగా తీసుకుని, నా ప్రమేయం లేకుండానే నా పెళ్లి నిశ్చయం చేశారు. శుభలేఖలు అచ్చు వేశారు. శ్యామా—చివరికి నా అసమర్థతకి కుటుంబగౌరవానికి తల వంచాను.—కాని నాలో రగిలే బడబాగ్ని ఎవరు గుర్తిస్తారు? నన్నే నమ్ముకున్న నీకు నేను చేసినద్రోహం నన్ను చిత్రవధ చేస్తుంటే ఆ నరకాన్ని భరించలేక పోయాను. నా మొహం నీకు చూపించే ధైర్యంలేని నేను లోలోపలే కుమిలి పోయేవాడిని. అమాయకంగా నవ్వుతూ ఎప్పటిలాగే తనివితీరా నన్నుచూసి నీ అందమైన కళ్లలోని ఆరాధనను చూసి చిత్రహింస అనుభవించేవాడిని — శ్యామా —నేనేలోకంగా ఎన్నో బంగారు కలలు కంటున్ననీకు — ఒక్కసారిగా నా పెళ్లి నిశ్చయమైనదని—చెప్పలేక పోయాను— —నీ లేతగుండె అప్పుడే బద్దలౌతుందని భయపడ్డాను—

ఆ పరిస్థితిలో నేనెంత పిచ్చివాడి నయ్యానో నీకు తెలియదు శ్యామా. నామీద, నాచేతకానితనంమీద ఏదో అర్థంకాని పగ పెరిగింది. సరిగ్గా అప్పుడేగా నాదగ్గరకు చిరునవ్వుతో వచ్చిన నిన్ను చూసే ధైర్యంలేక పిచ్చిగా—బయటకు పొమ్మని—'

ఆ బాధంతా ఇప్పుడు ప్రత్యక్షంగా అనుభవిస్తూ, నిష్కృతి లేనట్టుగా కుమిలిపోతున్న శంకర్ని—శిలలా చూస్తూ వుండి పోయింది శ్యామల.

క్షణాలు మౌనంగా భారంగా గడిచిపోయాయి.

'శంకర్ ఏదో అడుగుతానన్నారుగా...!' బాధన్ని వదిలంగా హృదయంలో దాచుకుని, సాధ్యమైనంత మామూలుగా



అడుగుతున్న శ్యామలని సూటిగా చూడ లేక—చీకటిని చూస్తూ వుండిపోయాడు.

'నువ్వు నువ్వు పెళ్ళెందుకు చేసుకో లేదు ..!'

శంకర్ పెదాలు వణికాయి.

శ్యామల మొహం వివర్ణమైంది. విశాలంగా వున్న కనులు కెలుకుతూ చూస్తుండి పోయింది.

'చెప్పు శ్యామా. నాకెందుకింత శిక్ష విధిస్తున్నావ్ !'

'శిక్షా .. నీకా...!' తెల్లబోయింది శ్యామల

'కాదా...నా ఆనందాన్ని, సౌఖ్యాన్ని మించి మరేమీ కోరలేని, నా దేవతా మూర్తి పవిత్రజీవితం నామూలాన శోకమైందని, ఎటువంటి అనుభూతులూ లేని మోడులా మిగిలిపోయిందని, జీవచ్ఛవంగా నా జ్ఞాపకాలతోనే బ్రతుకుతోందని గుర్తుకు వచ్చినప్పుడల్లా నేనెంతగా కుమిలిపోతానో నీకు తెలుసా. అన్నికళలూ మూర్తీభవించిన పవిత్రమూర్తిగా ప్రేమ మూర్తిగా నిర్ధారించిన నేను—కోరుతున్న ఒకే ఒక్క కోరికను—ఉపేక్ష్యం చేశావని, ఈ క్షణంలో తెల్సుకున్న నా మనసెంత కుమిలిపోతోందో నీకు తెల్సా...!'

ఆ గంభీరమూర్తి కనులలో నీరు చూసి చలించిపోయింది శ్యామల.

'మీ మాటలను అలక్ష్యం చెయ్యలేదు శంకర్. ఏదో తంగంలో పైకి రమ్మని మీ ఆశను, వ్యక్తం చేశారు ... నాలో దాగివున్న ప్రతిభను వెలికి తెచ్చి. మణిపూసలా వెలగాలని ఆశీర్వదించారు... అలాగే మీ ఆజ్ఞప్రకారమే డాక్టర్నై... నా విధిని నిర్వర్తిస్తున్నాను.—మనసులో దాగిన కలవరపెట్టే భావాలను కథలుగా వ్రాసి, నా స్వార్థంకోసం కదలు చిత్రించి, పెద్దరచయిత్రిగా...సంఘంలో పేరు సంపాదించాను...ఇదేగా...ఇదేగా... మీరు కోరింది...!'

చిగురాకులా శ్యామల పెదాలు వణుకుతూ వుంటే శంకర్ ఆవేశంతో ముందుకు జరిగాడు ..

'అంతేనా...అంతేనా శ్యామా నేను కోరుతున్నది. ఇదేనా నువ్వు నన్నర్థం చేసుకున్నది?... జీవితాంతం విషాదిలా

# ఆత్మార్పణ

నా శ్యామా మిగిలిపోవటం...నాకు ఆనంద మనుకున్నావా ... అందరిలా నా శ్యామా పెళ్లిచేసుకోవాలని...పిల్లల్ని ఎత్తుకో వాలని...భర్తతో ... స్వర్గ సౌఖ్యాలూ అనుభవించాలని...అన్ని అర్హతలూ వున్న నా దేవత జీవితం, అతిసామాన్యంగా, నిష్ఫలమూ, నిస్సారమూ ఐ మిగిలి పోకూడదని ... నేనెంతగా పరితపించే వాడినో...నీకు తెలుసా...!

నాకోసం నువ్వు ఆహుతి అవు తున్నావు...నిన్ను తలుచుకుని నేను ఆహుతి అవుతున్నాను...

శ్యామా. చెప్పు శ్యామా...ఎందుకిలా చేశావ్...నిన్ను వదిలి నా సుఖం నేను చూసుకున్నానని...నాకింత పెద్ద శిక్ష విధించావు కదూ ..నామీద ప్రేమ వుంటే నీ జీవితాన్ని ఎందుకిలా నాశనం చేసు కున్నావ్ ..ఇప్పుడైనా నిశ్చయించలేదా పెళ్ళి చేసుకోవాలని... ఇన్ని సంవత్సరాలూ ఏకాకిగా గడిపావే ..ఏ క్షణంలోనూ నీకనిపించ లేదా...నీ జీవితానికి తోడు కావాలని...'

ఆవేశంతో అంటున్న శంకర్...శ్యామల నవ్వు చూసి ఆగిపోయాడు—

కళ తప్పి, మతి తప్పి, జీవం లేన ట్టుగా వున్న ఆ నవ్వు ఎంతటి హృదయాన్నైనా కరిగించి కన్నీరు కార్పించ గల శక్తిని తనలో దాచుకుంది కళ్ళను నిండిన నీరు వెన్నెల వెలుగులో పకపకా నవ్వుతున్నాయి.

'అనిపించింది శంకర్. పెళ్ళి చేసు కోవాలని నా కెన్నోసార్లు అనిపించింది. భరించరాని ఈ ఏకాంతాన్ని వదిలి దూరంగా ఎక్కడికైనా పారిపోయి, నన్ను నన్నుగా ప్రేమించి, అనుక్షణమూ, నన్ను హృదయంలో నిలుపుకుని, ఆరాధించే ప్రేమమూర్తికి, అంకితమవాలని ఎన్నో సార్లు అనిపించింది—

'శంకర్! నాకేం తక్కువ. అందం లేదా? ఐశ్వర్యం లేదా? చదువు లేదా? అందర్నీ మించిన ఎన్నో అర్హతలు నా కున్నాయే...మరి ..మరి...అతి సామాన్య స్త్రీకి అందుబాటయ్యే ఆనందంలో వెయ్యోవంతుకూడ నా కెందుకు లేకుండా పోవాలి? నా జీవితం ఇలా...ఇంత భయం కరంగా ...ఎందుకు తెల్లవారాలి? అని నన్ను నేనే ఎన్నోసార్లు ప్రశ్నించు కున్నాను ..ఒంటరితనం ఎంత భయం కరమైనదో మీకు తెలియదు శంకర్ .. చిన్నారి మల్లెలు ఎత్తుగా, జాలిగా ... నన్ను పలకరిస్తుంటే ..కన్నీరు మున్నీరుగా ఏడ్చిన రోజులు ఎన్నని చెప్ప గలను...! నా చేతిలో ప్రాణం పోసుకుని హాస్పిటల్లో నవ్వులు విరబూసే పసిపాప లను హృదయానికి హత్తుకుని పరవ శించే ఎన్ని తల్లులను చూసి .. మాతృ త్వపు సౌఖ్యాన్ని అనుభవించలేని దౌర్భా గ్యురాలినయ్యానే అని ఎంతగా కుమిలి పోయేదాన్నో మీకు తెలియదు శంకర్...

అందుకైనా ..నాకూ పెళ్ళి చేసు కోవాలనిపించేది ... ! నిశ్చలంగా అంటున్న శ్యామలని జాలిగా, దీనంగా చూశాడు శంకర్

'మరి నిన్ను నువ్వే ఇంత కఠినంగా ఎందుకు శిక్షించుకున్నావు శ్యామా...!'

'పెళ్ళి చేసుకుందామంటే...మీలాంటి ఆయన నాకెక్కడా దొరకలేదు శంకర్...!'

నిర్లిప్తంగా అంటున్న శ్యామలని చూసి నిర్వేదంగా నవ్వాడు శంకర్,

'నాలాంటివాడా...! ఎక్కడ దొరుకు తాడు శ్యామా !'

'దొరకడు కనుకనే...నే నిలా...!'

దారీ తెన్నూ లేక సముద్రంలోకి కొట్టుకుపోతున్న నావను చూస్తూ...నిర్వి కారంగా అంది శ్యామల

హృదయభారాన్ని ఆపుకోలేని శంకర్ బరువుగా వెనుక్కు వాలి ఆకాశంలోకి శూన్యంగా చూస్తూ వుండిపోయాడు. నీళ్ళు నిండిన అతని కళ్ళల్లోకి జాలిగా చూస్తున్న ఎన్నో నక్షత్రాలు మసక మసగ్గా కదిలిపోతున్నాయి...

'మీ కాపురం ఎలా వుంది...!' నిశ్చ లంగా నిర్మలంగా చూస్తూ అడుగుతున్న శ్యామలని నిర్వికారంగా చూసి నిట్టూ ర్చాడు శంకర్.

'దివ్యంగా'

'పిల్లలు ముగ్గురు కదూ...!'

నవ్వసంగా తల వంచుకునే అంది శ్యామల.

'ఊ...!'

'మొత్తానికి ఫామిలీ ప్లానింగ్ అమ లులో పెట్టారన్నమాట..కంగ్రాచ్యు..!'

'థాంక్యూ...!'

అర్థంకాని భావాలతో ఒకరి నొకరు వరౌనంగా చూసుకున్నారు.

'ముగ్గురూ అమ్మాయిలేనా...!' చిరునవ్వు బలవంతాన వెలిగింది..

'ఎందుకనుకున్నావలా...!' ముందుకు వంగి తన వేసూటిగా, ప్రేమతో చూస్తున్న ...తను ఆరాధించే ఆ అందమైన కళ్లల్లోకి చూడలేక తల వాల్చింది.

'ఏమో...అబద్ధాలు ఎక్కువగా చెప్పే వారికి ఆడపిల్లలు ఎక్కువగా...!'

మాట పూర్తవకుండానే అదోలా నవ్వేశారిద్దరూ.

'...అబ్బాయి శ్యామసుందర్ ఐ.ఎ.ఎస్. ట్రైనింగవుతున్నాడు. అమ్మాయిలు... కృష్ణ, శ్యామ మెడిసన్ చదువుతున్నారు...'

శంకర్ అతి మెల్లగా చెబుతుంటే, శ్యామల కళ్లలో ఏదో కాంతిరేఖ మెరుపులా మెరిసి మరుక్షణంలో మాయమవటం గమనించిన శంకర్, బరువుగా నిట్టూర్చాడు. మరుక్షణంలో క్రిందకి వాలిన శ్యామల కనులలో ఏ భావాన్నీ చదవలేక పోయాడు శంకర్.

'శంకర్...అప్పుడే... అప్పుడే. మీరింత పెద్దవారైపోయారా ... ఇంకా చిన్ననాటి శంకరే అనుకుని... చిన్నపిల్లలా...ఏదేదో మాట్లాడేశాను... !' శ్యామల కళ్లు క్రొత్తగా తనని చూస్తుంటే భారంగా నిట్టూర్చాడు శంకర్.

'నేనేం మారినట్టు కన్పించటంలేదా శ్యామా...!'

కుతూహలంతో అడుగుతున్న శంకర్‌ని చూసి లేదన్నట్టు తల వూపింది

'నా కెప్పటిలాగే కన్పిస్తున్నారు మీరు. బహుశా అమృతం తాగారేమో... !' చిన్నగా శ్యామల నవ్వుతుంటే, తమాషాగా నవ్వేశాడు శంకర్.

'కానీ...నువ్వు చాలా మారిపోయావు శ్యామా...!'

'అమ్మమ్మలా వున్నాను కదూ...!'

నెమ్మదిగా అతి బరువుగా ధ్వనించింది శ్యామల కంఠం.

'అని నేనన్నానా...అనగలనా శ్యామా... ఏళ్లేళ్ల శ్యామలగా కన్పించటం లేదు రాకు... వయసు మనిషిని పెద్ద చేస్తుందంటారు... నువ్వు మానసికంగా ఎంతో పెరిగావు...కాని— ఎర్రని నీ బుగ్గల్లో, పూర్వపు నునుపింకా చెదిరిపోలేదు. పల్చని నీ పెదాలు చలిస్తుంటే ... అలా అలా చూడాలని... ఇప్పటికీ నా కన్పిస్తోంది...'

మెరిసే కళ్లతో చెబుతున్న శంకర్‌ని వింతగా చూసింది శ్యామల.

'సరిగా పాతిక సంవత్సరాలక్రితం నేను వినాలని కలలుగన్న ఈ మాటలు ... ఇప్పుడు...ఈవిధంగా...!'

ఇంకేమనాలో తోచని శ్యామల మాటలు తడబడ్డాయి

'నువ్వు పొరబడ్డావు శ్యామా. ఈ భావాలు, అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ, నాలో చెదిరిపోకుండానే వున్నాయి... మనమెంత సన్నిహితులమైనా ... ఏనాడూ హద్దుమీరని మన సంస్కారం ... మన కంటె కూడ ముందు పుట్టిన సభ్యత...ఆ పరిస్థితులూ ... వాటి ప్రభావాలు... !' చెప్పలేక చెబుతూ ... తనలోనే గొణుక్కుంటున్న శంకర్ ప్రాంతా పూర్వకంగా శ్యామలని చూశాడు ..

'నిన్ను మనసారా ఒక కోరిక కోరుకుంటున్నాను...కాదు. అర్థిస్తున్నాను... అంగీకరించగలవా శ్యామా. .!' పసిపాప లాంటి బేలత్వం అతని గంభీర ప్రకృతిని దాచివేసిందా క్షణం.

ప్రశ్నార్థకంగా చూస్తూ వుండిపోయింది శ్యామల.

'నువ్వు నాతో వచ్చెయ్యగలవా ... శ్యామా !'

అదిరిపడింది శ్యామల.


'ఎక్కడికి'

'మా ... మన ఇంటికి. ఇన్నాళ్లూ నిన్ను బాధపెట్టిన పాపం నాకు చాలు... నీకు తెలియదు శ్యామా నా శరీరం ఎంతో దూరంగా వున్నా... నా మనసెప్పుడూ నీ కెంతో దగ్గరగనే వుండేది. నువ్వు గుర్తుకువచ్చినప్పుడల్లా...నీకు నేను చేసిన అన్యాయం శాపంలా నన్ను వెంటాడి ... నన్నెంత చిత్రవధ చేసేదో ... నేనెంత కుమిలిపోయేవాడినో...నీ కర్థం కాదు... ఏ పరిస్థితులు మనని విడదీశాయో ... నా కంటే కూడ ..నీకే బాగా తెలుసు ... పరిస్థితులకు లొంగి ఇంతవరకూ నా కర్తవ్యాన్ని నేను నిర్వర్తిస్తూ వచ్చానేగాని... గతాన్ని మరచికాదు ... భోగాలకూ...సుఖాలకూ లొంగికాదు. .నిన్నువిడిచి నా మనసు ఒక్కక్షణం కూడ వంటరిగా వుండలేదు శ్యామా...

...నిన్ను...నిన్ను... ఇంటికి రమ్మని ఇప్పుడు మనసారా ... ఆహ్వానిస్తున్నాను. కాదనకు శ్యామా!'

శిలలను సహితం కదిలించే అతని దైన్యం శ్యామలను ద్రవింపజేసింది.

'శంకర్ ..నేనే నిజంగా మీ ఇంటికి వస్తే...వెళ్లికేమని సమాధానం చెబుతారు పిల్లలకి, లోకానికి నేనెవర్నని పరిచయం చేస్తారు! వద్దు శంకర్ కలిపి



జీవించాల్సిన వయసులో విడివి జీవించాము. తుచ్ఛమైన ఐహిక వాంఛలకు లొంగని పవిత్ర ప్రేమికులంగా ... పవిత్రంగా మిగిలిపోయాము! ఇంతగా ఒకరినొకరు ఆరాధిస్తూ కూడ ఒకరి స్పర్శ మరొకరికి తెలియని అనుబంధం మనదని లోకం నమ్ముతుందా? ఈ వయసులో మనం కల్సి వుండి, రంగుటద్దాలతోనే చూడగల ఈ లోకానికి అలుసెందుకివ్వాలి...!

యువ్వన ప్రేరకాలు...వయసు పొంగులు...తియ్యని వాంఛలు...ఏనాడో అణగారిపోయాయి. ఈ వయసులో ... ఆత్మార్పణే మనకు నిజమైన ఆనందాన్ని అందిస్తుంది...కాదంటారా శంకర్...'

మనోవ్యథలతో తలపండి మరింత వృద్ధురాలిగా కన్పిస్తున్న శ్యామల శంకర్‌కు యోగినిలా కన్పించింది

'పోనీ...ఒక్కసారైనా...ఇంటికి వచ్చి వెళ్ళకూడదా!'...అదే దైన్యం తొంగి చూసింది శంకర్ వదనంలో

'వద్దు శంకర్ ఈమాత్రంకూడ నేను శాంతిగా వుండటం మీకిష్టం లేకపోతే.. మీరా కోరిక కోరండి...!' శ్యామల వివశంగా చలించిపోయింది.

దెబ్బతిన్నట్టుగా చూశాడు శంకర్.


'శంకర్...శారీరకంగా నేను ఏకాకిగా మిగిలిపోయినా...నాలోకం వేరుగా వుంది. శంకర్. నా ఊహాలోకంలోని నా ప్రపంచం

# ఆత్మార్పణ

వేరుగా వుంది. అందులో నాకో చక్కని ఇల్లు వుంది ...అందులో..అందులో మిమ్మల్ని ఆరాధిస్తూ...మీతో దాంపత్యం చేస్తూ...అందమైన పాపలతో ఆనందంగా జీవిస్తున్నాను. ఆ లోకంలో నాకూ ఇల్లుందని, భర్త, పిల్లలు, సంసారం అందరూ వున్నారని, కనీసం కలలోనైనా తృప్తిపడుతున్నాను. నా భర్త...శంకర్ నా సర్వస్వం. నా ఆరాధ్యదైవం. అతను నా సొమ్ము. అతనిమీద ఎవ్వరికీ అధికారంలేదు మరొకస్త్రీ పొరపాటున కూడ అతనిని చూసే అవకాశం లేకుండా... అతనిని నా గుండెల్లోనే దాచుకుని ఆరాధిస్తున్నాను...పిల్లలు కూడ... కాలంతో బాటు పెరుగుతున్నారు...పెద్దవారవుతున్నారు...చదువుకుంటున్నారు...

జీవితాంతం ఈ భ్రాంతినే నిజాలుగా నమ్మి జీవిద్దామనుకుంటున్నాను...ఇప్పుడు మీ ఇంటికి వస్తే...నా కమ్మని కల కరిగిపోదా... నా జీవితం... నా సంసారం, ధ్వంసమైపోదా...నా పిల్లలు తండ్రిలేని వాళ్ళు కారా ... నా శంకర్ ప్రక్కన నా స్థానంలో మరొకరు నిలబడి వుంటే...మరొకరు...మిమ్మల్ని 'నాన్నా' అని పిలుస్తుంటే.

ఒక స్త్రీగా...ఒక సామాన్య స్త్రీగా ...




నేను...నేను భరించకలనా? చెప్పండి శంకర్! కనీసం ఈ అదృష్టాన్ని కూడ నాకు దూరం చేస్తారా శంకర్...!'

రెండు చేతులతో మొహాన్ని దాచుకుని పసిపాపలా ఏడుస్తున్న శ్యామలని చూస్తూ పిచ్చివాడే అయిపోయాడు శంకర్.

ఆ బాధకు అంతంలేదు. ఆ ఆవేదనకి అంతులేదు. మానని గాయం క్షణ క్షణానికీ రేగి, హృదయాన్ని తీవ్రంగా నలిపివేస్తూ వుంటే.. ఆ హృదయ వేదనను తగ్గించటం ఎవరికి సాధ్యపడుతుంది? ఆ కన్నీటిని తుడవటం ఎవరికి చేతనౌతుంది? ఎడబాటును భరించలేని ప్రేమజీవులు అనుక్షణం ఒకరి పొందును మరొకరు కోరుతూ ఆ పొందులోనే అమర సౌఖ్యాలనూ, అనుభవించే ఘట్టాలు కొన్ని వుంటాయి.

కానీ—

సర్వస్వంగా భావించి, ప్రేమించి ఆరాధించి ప్రతిక్షణం వారి కోసమే జీవిస్తున్నా కూడ, వారి సమక్షం మాసిన గాయాన్ని రేపి, చిత్రహింస అందింపజేసే ఘట్టాలు ప్రేమికుల జీవితాల్లో ఎంతో అరుదుగా విషాదభరితమైన మైలు రాళ్ళుగా నిలుస్తాయి

బరువుగా లేచిన, శంకర్‌ని కన్నీటితో జాలిగా చూసింది శ్యామల. ఇద్దరి కళ్ళూ క్షణకాలం కలుసుకుని ఆర్ద్రతతో ద్రవించి కన్నీటిని వర్షించాయి

'వెళ్ళిపోతారా శంకర్...!' మెల్లగా లేచిన శ్యామల రెండు చేతులతో మొహాన్ని కప్పుకుంది.

'శ్యామా...!' ఆపుకోలేని ఆవేదనతో ముందు కదుగువేసిన శంకర్...ఎందుకో.. ఆగిపోయాడు.

'ఈ ఊరినుంచే ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వెళ్ళిపోతాను శ్యామా...!' జీవం లేనట్టుగా అంటున్న శంకర్ని జాలిగా చూసింది శ్యామల.

'వద్దు...శంకర్ ... మీరు వెళ్ళొద్దు. మీకెన్నో బాధ్యతలూ ... పిల్లల చదువులూ ... నేనా ... నేనంటే ఎక్కడికి వెళ్ళినా... బాధపడేవారుండరు ... అందుకే ... మొన్న మిమ్మల్ని చూడగానే...ట్రాన్స్‌ఫర్‌కి అప్లై చేశాను...

# ఆత్మార్పణ

ఆ క్షణంలో శ్యామల హృదయంలో రగిలే బడబాగ్ని ఒక్క శంకర్ కే స్పష్టంగా కన్పిస్తోంది.

—శంకర్ హృదయంలో రేగిన పెను తుఫాను ఒక్క శ్యామలే స్పష్టంగా చూడగలుగుతోంది.

'ప్లీజ్...ఇంక వెళ్ళిరండి శంకర్..!' వస్తున్న దుఃఖాన్ని అతి ప్రయాసమీద ఆపుకుంటూ, క్రింది పెదవి, మునిపళ్ళ మధ్య నలిగిపోతూ వుంటే ... మొహాన్ని ప్రక్కకు తిప్పుకుంది...

అతి భారంగా ఎంతో నిర్జీవంగా రెండు అడుగులు ముందుకు వేసిన శంకర్— ఆగిపోయాడు.

'శంకర్!'...

శోకమూర్తిలా ముందుకడుగు వేసిన శ్యామల, శంకర్ని తదేకంగా చూస్తూ... తనకు కావల్సిన ఏదో వరాన్ని... నీళ్ళు నిండిన అతని కళ్ళలో వెతుక్కుంటోంది...

'నన్ను గుర్తుంచుకుంటావా శంకర్...!'

మూర్తీభవించిన శోక దేవతలా, కట్టలు త్రెంచుకుని ప్రవహించే కన్నీళ్ళను ఆపుకోలేక, హృదయభారాన్ని అరికట్టలేక, అతని పాదాలమీద వాలి పోయింది...

'శ్యామా...!' బలంగా శ్యామల బుజాలను పొదివి పట్టుకుని ఆత్రంగా దగ్గరకు తీసుకోబోయి...

—ఆగిపోయాడు.

శ్యామల శిరస్సును ఆప్యాయంగా నిమురుతూ ... మాటలు రాని మూగగా ... ఏదేదో అనాలని విశ్వప్రయత్నం చేస్తున్నాడు.

'...నిన్ను...నిన్ను...మర్చిపోతే...నన్ను నేను మర్చిపోయినట్టే శ్యామా ...!' జాలిగా శంకర్ కళ్ళలోకి చూస్తున్న శ్యామల...మరింత జాలిగా అర్థించింది.

'ఆఖరి కోరికగా ఒక్కటి కోరుకుంటాను...దయచేసి...ఇదైనా—!'

'అడుగు...అడుగు శ్యామా...!'

శంకర్ కంఠం బొంగురు పోయింది.

'ఇన్ని సంవత్సరాల తరువాత ... అనుకోకుండా...కల్సుకున్నాము ... మళ్ళీ ఇంతటి వరం...మన కందరాని దౌత్యం దేమో...అందుకని ... ఏ కారణంగానైనా నేను మరణిస్తే...ఆఖరి ఘడియల్లో ... మీ ఒడిలో ప్రాణాన్ని వదిలే అదృష్టం..!'

'శ్యామా...! నన్నింకా చిత్రవధ చెయ్యకు శ్యామా...ఏం...నువ్వే ముందర పోవాలా...అంతటి అదృష్టం...!'

శంకర్ కంఠం విపరీతంగా చలించింది.

'వద్దు...వద్దు శంకర్. ఈ విషయంలో మటుకు ఆ అదృష్టం...నాకే... నాకే కావాలి...వస్తారు కదూ ...ఏదీ ప్రమాణం చెయ్యండి...!'

ముందుకు చాచిన శ్యామలచేతిని, తన మాట జరిగితీరుతుందన్నంత ఆత్మవిశ్వాసంతో, అగ్నిశిఖలా నిలబడ్డ శ్యామలను పిచ్చిగా చూస్తూ వుండిపోయాడు శంకర్.

'శంకర్...నాకోసం ... నా ఆనందం కోసం...!'

శ్యామల చెయ్యి మరుక్షణంలో...బలమైన శంకర్ చేతిలో బిగిసిపోయింది.

—శరీరాలు కలిసేముందు, చేతులు కలవటం సర్వసాధారణం. ఆ కలయికలో మనసులు కలవకపోవటంలో ఆశ్చర్యం లేదు.

—కానీ—

శరీరాలు వేరయేముందు, చేతులు కలవటం దైవఘటన.

—కానీ కలిసిన ఆ మనసులు ఎప్పటికీ విడిపోవు; ఆ ప్రేమ పవిత్రమైనది, ఆ బంధం అమరమైనది.

ఇద్దరికళ్ళూ వర్షిస్తుంటే మౌనంగా తుదిసారిగా చూసుకున్నారు.

—చేతిని వదిలి బరువుగా ,ముందుకు సాగిపోతున్న డాక్టర్ శంకర్, అడుగులు అతి బరువుగా...అతని హృదయం లాగే కృంగిపోతున్నాయి.

—అప్పటికి, ఇప్పటికీ, ఎప్పటికీ భౌతికంగా ఏకాకిగా మిగిలిన డాక్టర్ శ్యామల, మందగించిన కంటిచూపులో మసక మసగ్గా సాగిపోతున్న తన పెన్నిధిని, కంటి వెలుగు ఆనేటంతవరకూ— చూస్తూ—

—రెండు చేతులతో మొహాన్ని దాచుకుంది.

